క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన అయ్యల చెర్వు లోని మిస్పా వృద్ధా శ్రమంలోని వృద్ధులకు ఉపాధ్యాయురాలు భ్రమరాంభ తల్లి సరస్వతి జ్ఞాపకార్థం ఉలెను దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిస్పా వృద్ధా ఆశ్రమ నిర్వాహకులు జక్కరయ్య, రాహుల్ పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో ఆదివారం లక్ష్మీ చెన్నకేశవ స్వామి పండుగ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆరు పళ్లలోపు ఎద్దుల బండలాగుడు పోటీలను హోరాహోరీగా సాగాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో వివిధ రాష్ట్రాల నుంచి 31జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలను చూసేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. యువత ఈలలు, కేరింతల మధ్య పోటీలు ఉత్సాహంగా సాగాయి.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక సంతపేటలో ఆదివారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. వీధిలో తిరుగుతూ జనాలపై దాడి చేసింది. కాలనీకి చెందిన జయభారత్‌రెడ్డి, అచ్యుత్, దస్తగిరిని విచక్షణా రహితంగా కరిచింది. కుక్కదాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

పండుగ పూట విషాదం

డోన్ టౌన్ : మండల పరిధిలోని కన్నపుకుంట గ్రామంలో లారీ డ్రైవర్, యజమాని చాకలి మల్లికార్జున(48) గుండె పోటుతో మరణించడంతో పండుగపూట గ్రామంలో విషాదం ఛాయలు అలుముకున్నాయి. ఆదివారం తెల్ల వారితే సంక్రాంతి బోగి పండుగ నిర్వహించుకోవాల్సి ఆ ఇంటిలో యజమాని మృతి చెందడంతో విషాదం నెలకొంది. నిద్రలోనే గుండె పోటు రావడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. డోన్ లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, శివరామ్, ఉపాధ్యక్షుడు లక్ష్మన్న గ్రామానికి వెళ్లి భౌతికగాయంపై సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

అవుకు: మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన సురేష్ భార్య అనిత ఆదివారం సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కుటుంబ కలహాల మూలంగా ఐదు నెలల గర్భిణి అనిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

మట్కా బీటర్ అరెస్టు

డోన్ టౌన్ : పట్టణంలోని రాజ్ థియేటర్ వెనకాల మట్కా రాస్తున్న బెస్త చంద్రకళను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు తెలిపారు. మట్కా నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఆమె నుంచి రూ.3,900 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆదివారం తెలిపారు.

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

డోన్ టౌన్ : బీసీలకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తగిన ప్రాధాన్యతనిచ్చి న్యాయం చేయాలని బీజేపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మంజునాథ నాయుడు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు తగిన న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు గోపిశ్రీనివాసులను కోరామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి, జిల్లా సభ్యులు అర్కే రెడ్డి, రాఘవేంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

డోన్ : స్థానిక వేంకటేశ్వర ఆలయంలో గోదాదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మల ఆధ్వర్యంలో ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకొని జరిగిన ఈ కళ్యాణ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు గుంటూరు సుబ్బారావు, రజనిబాయి, శ్రీనివాసశర్మల అధ్వర్యంలో మకర సంక్రాంతి భోగిని పురస్కరించుకొని ఆలయ ఆవరణలో భోగి మంటలను వేసి భక్తులు సంబరాలు జరుపుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కుటుంబ సభ్యులతో కలిసి పూర్వ విద్యార్థుల

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా జరిగింది. బెలుం గుహల ఆవరణలో రామ్‌కో సిమెంట్ కంపెనీ నిర్మించిన వెయింటింగ్ హాల్‌లో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి బోగి మంటలు వేసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. అందరూ ఒక చోట కలుసుకునే అవకాశం కల్పించిన గూడురు శివరామిరెడ్డిని పూర్వ విద్యార్థుల బృందం అభినందించారు.

నెరవేరనున్న సొంతింటి కల!

- ఊళ్లుగా దర్శనమిస్తున్న జగనన్న కాలనీలు
- ఇప్పటికే గృహప్రవేశం చేసిన కొందరు లబ్ధిదారుల
- సంతోషం వ్యక్తం చేస్తున్న పేదలు


కొలిమిగుండ్లలో ఊరులా కనిపిస్తున్న జగనన్న కాలనీ

కొలిమిగుండ్ల: పేదల సొంతింటి కల సాకారమవుతోంది. సొంతిళ్లు లేదనే మాటే వినపడకూడదన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం మేరకు అర్హులైన పేదలందరికీ అధికారులు ఇళ్ల పట్టాలతోపాటు గృహాలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. దీంతో జగనన్న కాలనీలు ఊళ్లలా దర్శనమిస్తున్నాయి. కొలిమిగుండ్ల గ్రామ సచివాలయ పరిధిలో ఏళ్ల తరబడి సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న పేదలను గుర్తించి ప్రభుత్వం అతి సులభంగా ఇళ్లు మంజూరు చేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కొలిమిగుండ్ల ఒకటవ గ్రామ సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. పేదలు కలలో కూడా ఊహించని విధంగా 544–డీ జాతీయ రహదారి చెంతనే కస్తూర్బా పాఠశాలకు ఎదురుగా ఉన్న విలువైన ప్రభుత్వ స్థలంలో ఇళ్ల పట్టాలను ఇచ్చారు. జగనన్న కాలనీలో మొత్తం 330 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మొదటి విడతలో 'కుడా' కింద 151 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. ప్రస్తుతం కాలనీలో 14 ఇళ్లు పూర్తి అయ్యాయి. ఇప్పటికే ఐదు మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేశారు. 06 స్లాబ్ దశలో ఉండగా,1 8 ఇళ్లు రూఫ్‌లెవల్‌లో ఉన్నాయి. 84 ఇళ్లు బేస్ లెవల్ దాటాయి. ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుంది. ఇప్పటి వరకు జగనన్న కాలనీలో లబ్ధిదారుల కోసం ప్రభుత్వం బిల్లుల రూపంలో 1.21 కోట్లకు పైగానే చెల్లించింది.




చురుగ్గా సాగుతున్న ఇళ్ల నిర్మాణాల దృశ్యం

మౌలిక వసతుల కల్పన: జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వగానే మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. విశాలమైన గ్రావెల్ రోడ్లు నిర్మించారు. లేఅవుట్‌లో ప్రతి కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించారు. మంచినీటి కోసం ఇబ్బందులు పడకుండా కాలనీలో రెండు బోర్లు వేసి తాత్కాలికంగా మినీ ట్యాంక్‌లు నిర్మించారు. త్వరలోనే రూ.60 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టనున్నారు. అక్కడక్కడ వీధిలైట్లు అమర్చారు. గృహ నిర్మాణాలు పూర్తి కాగానే లబ్ధిదారులకు విద్యుత్ శాఖ అధికారులు 15 మీటర్ల విద్యుత్ వైర్, మీటర్, బోర్డు ఉచితంగా అందిస్తున్నారు. జాతీయ రహదారి చెంతనే ఉన్న జగనన్న కాలనీ మినీ విలేజ్‌గా తయారు కాబోతుంది. ఇంటి నిర్మాణానికి మెటీరియల్, సకాలంలో బిల్లులు చెల్లిస్తూ అండగా నిలుస్తుంది. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో స్వంతింటి కళ నేరవేరడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కాలనీలో నీటి కోసం ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్

చాలా ఏళ్లకు కల నేరవేరింది



మా పెద్దలు ఉన్నప్పటి నుంచి స్వంతిళ్లు లేక పోవడంతో అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తున్నాం. గతంలో ఇంటి స్థలం కోసం పదుల సార్లు దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం వచ్చాక ఇంటి స్థలం కోసం అప్లై చేసిన వెంటనే మంజూరైంది. స్థలం వస్తుందని ఊహించలేదు. కాలనీలో ఇళ్లు కట్టుకొని రెండు నెలల క్రితం గృహ ప్రవేశం చేశాం.. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– షెక్షావలి, లబ్ధిదారుడు

బిల్లులు చెల్లింపుల్లో ఇబ్బందులు లేవు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వెంటనే దశల వారీగా బిల్లులు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. కాలనీలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులకు ఇసుక అందుబాటులో ఉంచాం. కాలనీలో అన్ని సౌకర్యాలు అందుబాటులో కల్పిస్తున్నాం. కాలనీలో ఆర్బీ ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయి. లబ్ధిదారులు త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలి.

– మద్దిలేటి, హౌసింగ్ ఏఈ

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లోనే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట వేళల్లో తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దుర్గ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. ముక్కమల్ల, ముదిగేడు, అల్వకొండ, వసంతాపురం, కమలపూరి, గిద్దలూరు, కానాల, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె ఫీడర్లకు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరుకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ తెలిపారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగను పురష్కరించుకుని కనకాద్రిపల్లెలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెయ్యితో అభిషేకం చేశారు. స్వామి వారికి అయ్యప్ప దీక్ష స్వీకరించిన స్వాములు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అయ్యప్పమాల స్వీకరించిన స్వాములు సోమవారం ఇరుముడులు స్వీకరించి శబరి మలకు బయలు దేరనున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. లింగ్‌కు ఆయన హాజరయ్యారు. రౌడీ షీటర్లకు సంబంధించి ఒక్కొక్కరి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ నేర చరితను విడనాడాలని, కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో జీవితం గడపాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఏలాంటి అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించిన ఉపేక్షించేది లేదన్నారు. ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు. మట్కా,జూదం, గంజాయి,నాటు సారా విక్రయాలు తదితర విషయాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఎన్నికల్లో ఏలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా మిమ్మలను బాధ్యులను చేస్తామన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతి వారం పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని, పట్టణం వదలి ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఏఎస్ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తిపై ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన నరేష్ గ్రామ సమీపాన చెరువు వద్దకు మేకలు మేపడానికి పోయాడు. అక్కడే ఉన్న మహేష్ అనే వ్యక్తి నరేష్‌ను కులం పేరుతో దూషించాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

డోన్ : ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం గర్భిణులు, రోగులకు ప్రార్థన సమయం నిర్వాహకులు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. స్థానిక దినపత్రిక విలేకరి వెంకటేష్ ఆర్థిక సాయంతో రోగులు, గర్భిణులు, బాలింతలకు రొట్టె, గుడ్డు, పప్పు పంపిణీ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్, మున్నా, రాజేష్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గాలి పటాలు ఎగురవేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలి

డోన్ టౌన్ : గాలి పటాలు (పతంగులు)ఎగర వేసేప్పుడు పిల్లలు జాగ్రత్తలు పాటించేలా పెద్దలు సూచించాలని విద్యుత్ ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. గాలి పటాలను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గర, కరెంటు తీగల సమీపంలో ఎగుర వేయకుండా చూసుకోవాలన్నారు. అనుకోని పరిస్థితుల్లో విద్యుత్ తీగలకు పతంగులు తగులుకుంటే వెనక్కు తీసుకునే ప్రయత్నం చేయొద్దని, విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సొంత ప్రయోగాలు చేసి ప్రమాదాల బారిన పడొద్దని, పండుగను ఆనందంగా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు.

'పచ్చ నాయకులు పోవాలి.. క్రిమినల్స్ రావొద్దు'


భోగి మంటల్లో 'పచ్చ నాయకులు పోవాలి, క్రిమినల్స్ రావొద్దు' ప్లకార్డులను కాల్చుతున్న ఎమ్మెల్యే కాటసాని, వైఎస్సార్‌సీపీ నాయకులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- భోగి మంటల్లో ప్లకార్డు కల్చివేసిన ఎమ్మెల్యే కాటసాని
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న బాబు, లోకేష్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరిక

బనగానపల్లె రూరల్ : టీడీపీ నాయకుల తీరుపై ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న బాబు, లోకేష్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎర్రబుక్కులో వైఎస్సార్‌సీపీ నాయకుల పేర్లు రాసుకున్నామని... వారి అంతు చూస్తామని బెదరింపులకు పాల్పడుతున్న నారా లోకేష్, చంద్రబాబు తీరును నిరసిస్తూ ఆదివారం 'పచ్చ నాయకులు పోవాలి, క్రిమినల్స్ రావొద్దు' అనే నినాదలు చేస్తూ ప్లకార్డ్స్‌ను ఎమ్మెల్యే ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఎమ్మెల్యే సతీమణి కాటసాని జయమ్మ, కోడలు కాటసాని మేథాశ్రీరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నిరసన తెలిపారు. టీడీపీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాజీ సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ పొంతనలేని విమర్శించడం సిగ్గు చేటన్నారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీకి సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసు కోడంతో జీర్ణించుకోలేని చంద్రబాబు కోర్టు ద్వారా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. సైకోలా ఎవరు వ్యవహరిస్తున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసున్నారు. వారు ఎక్కడ సమావేశాలు సభలు పెట్టినా తాము ఈ అభివృద్ధి చేస్తామంటూ ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని, ఎర్రబుక్కు... పచ్చబుక్కు అంటూ బెదరింపులకు పాల్పడుతున్నారని విమిర్శంచారు. ఇలాంటి క్రిమినల్ తత్వం టీడీపీ నాయకుల ఆలోచనలను భోగి మంటల్లో వేసి కాల్చివేశామన్నారు.

అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్న బీసీ జనార్ధన్‌రెడ్డి

బనగానపల్లెను తాను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి అడ్డుంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని ధ్వజమెత్తారు. బనగానపల్లె పట్టణంలో తాను ఇళ్లలేని 3,500 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి సర్వం సిద్ధం చేశానని, అయితే మాజీ టీడీపీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి కోర్టు ద్వారా అడ్డుకున్నారన్నారు. న్యాయపరంగానే పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ త్వరలోనే చేస్తామని ఎమ్మెల్యే కాటసాని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీ సుబ్బమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారియల్లమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఫైజ్, యల్లయ్య, కృష్ణారెడ్డి, అంబటిరవికుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కిశోర్, మహబూబ్‌వలి, ప్రసాద్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన భోగి సంబరాలు


భోగిమంటలు వేస్తున్న దృశ్యం


భోగి మంటల చుట్టూ నృత్యం చేస్తున్న మహిళలు


బేతంచెర్ల: బుగ్గానిపల్లె తాండ గ్రామలో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో సంక్రాంతి పండుగను పురష్కరించుకుని ఆదివారం భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భోగి సంబరాలు అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచే ఇళ్ల ఎదుట అందమైన ముగ్గులు వేశారు.రంగవళ్లులను తీర్చి దిద్ది గొబ్బెమ్మలను పెట్టి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. గ్రామాల్లో గోమాత పూజ, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు విశేషంగా అలరించాయి. కాలనీలు ముగ్గులతో కళకళలాడాయి. సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలు ఇళ్ల ముందు రంగు రంగులతో ముగ్గులు వేసి భోగి మంటలతో వేడుకలను జరుపుకున్నారు.

బనగానపలె రూరల్ : మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా భోగి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నందవరం, యాగంటిపల్లె తదితర గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్ల ముందు కల్లాపు చల్లి, అందంగా ముగ్గులు వేసి,పూలు, గొబ్బిళ్లతో అలంకరించారు.

భోగి సంబరాలు

డోన్ : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మున్సిపల్‌చైర్మన్ సప్తశైల రాజేష్ ఇంటి ఆవరణలో భోగి సంబరాలు వైభవంగా నిర్వహించారు. చైర్మన్ సతీమణి, ఉద్యానవన యూనివర్సిటీ సభ్యురాలు సప్తశైల సుమిత్ర రాజేష్ ఆహ్వానం మేరకు పట్టణానికి చెందిన పలువురు భోగి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలను వేసి సాంప్రదాయంగా మహిళలు నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కోట్రికె గాయత్రి, మాజీ కౌన్సిలర్ కోట్రికె ఫణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో భోగి సంబరాలు వైభవంగా జరిగాయి. ఇళ్ల ఎదుట వేసిన రంగు రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. గౌరిపేటలోలో వెలసిన చెన్న కేశవ, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. సిమెంట్ నగర్ గ్రామంలోని కోదండరామాలయం, గ్రామ దేవత సుంకులా పరమేశ్వరి దేవికి మహిళలు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. బుగ్గానిపల్లె తాండ గ్రామంలో ఉప సర్పంచ్ వెంకటేష్ నాయక్, గ్రామస్తులు ఒకే చోట చేరి భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు.

డోన్ టౌన్ : సంక్రాంతి పర్వదినంలో భాగంగా భోగి పండుగను ప్రజలు ఆనందోత్సావాలతో జరుపుకున్నారు. ఉడుములపాడు సర్పంచ్ ఉప్పరి రాధ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని తారకరామనగర్, కోట్లవారిపల్లెలో సీపీఎం అనుబంధ సంఘాలు ప్రజా నాట్యమండలి, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు గ్రామాల్లో భోగి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పేరుసోములలో శ్రీవిద్య పాఠశాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీడీఓ నాగకుమార్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేసిన జడ్జి

డోన్ రూరల్ : పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీలో సంక్రాంతి పండుగ సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు డోన్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ముగ్గుల పోటీలలో మహిళలు మంచి ప్రతిభను కనబరిచారన్నారు. మహిళలు కాలనీలో ముగ్గులు వేయడంతో కాలనీ అంతా సుందరంగా మారిపోయిందన్నారు. కార్యక్రమంలో సింగర్ పార్వతి, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తదితరులు పాల్గొన్నారు.


గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న సివిల్ కోర్టు జడ్జి తంగమణి


ఉడుములపాడు గ్రామంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు


మహిళకు బహుమతి అందజేస్తున్న ఎంపీడీఓ నాగకుమార్